క్లుప్తంగా

పింఛన్ల పంపిణీని పరిశీలించిన డీఆర్డీఏ పీడీ



నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా డీఆర్డీఏ (వెలుగు)పీడీ అవనిగడ్డ నియోజకవర్గం స్పెషలాఫీసర్ పి.సాయిబాబు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులతో కలిసి ఆయన పంపిణీ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి జరుగు పవన్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ ముక్కొల్లు సోమయ్య, మండల పరిషత్ ఉద్యోగి కె.బిందు ఆయన వెంట ఉన్నారు. మండలంలో మొత్తం 7,864 పింఛన్లు విడుదల చేయగా సాయంత్రం 4 గంటలకు 7,137 మందికి పింఛన్లు అందజేసినట్లు ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ తెలిపారు.

92.64 శాతం పింఛన్ల పంపిణీ

మోపిదేవి: మండలంలో 92.64 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జె.స్వర్ణభారతి శనివారం తెలిపారు. మొత్తం 13 గ్రామ పంచాయతీల్లో 6,088 పింఛన్లకు గాను 5,640 పింఛన్లు తొలిరోజే పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటా తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసినట్లు వివరించారు.

అమ్మవారి గ్రామ సంచారం



చల్లపల్లి: పెదప్రోలు గ్రామ దేవత శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారు శనివారం చల్లపల్లి పురవీధుల్లో గ్రామ సంచారం చేశారు. ఈ నెల 14వ తేదీన జరగనున్న పెదప్రోలు శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు 15 రోజుల పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఒక్కో రోజు ఒక్కో గ్రామం చొప్పున సంచారం చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తమ ఇంటి ముందుకు వచ్చిన అమ్మవారికి మహిళలు పసుపు, వేప ఆకులు కలిపిన నీటిని బిందెలతో అమ్మవారికి వారబోశారు. పసుపు, కుంకుమ, గాజులు, రవిక, పూలు అమ్మవారికి సమర్పించి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు.

సామూహిక కుంకుమ పూజలు



చల్లపల్లి: స్థానిక గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి ఆలయంలో శనివారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఆదివారం వరకు 26వ ఆలయ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అర్చకుడు చిదానందశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత



చల్లపల్లి: ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో 1984– 85 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు క్రీడా సామగ్రిని శనివారం అందజేశారు. క్యారమ్ బోర్డులు, వాలీబాల్, టెన్నికాయిట్, త్రోబాల్, షటిల్ బ్యాట్స్ వంటివి సుమారు రూ.12 వేల విలువ గల సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుదర్శన్ ప్రసాద్, వ్యాయామోపాధ్యాయుడు జి.శ్రీనివాస్‌లకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రావులపల్లి విఘ్నేశ్వరరావు, రావులపల్లి మస్తాన్‌రావు, కంతేటి చంద్రశేఖరరావు, కొల్లిపర నరేంద్ర, ఉడత్తు వెంకటేశ్వరరావు, వెంట్రప్రగడ రమేష్, షేక్ నబీఘోరి తదితరులు పాల్గొన్నారు. తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించిన పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

‘స్మార్ట్’ బాదుడుకు సిద్ధం

- విద్యుత్ వినియోగదారులపై ‘స్మార్ట్’గా బాదుడు
- ముందుగా కమర్షియల్.. పరిశ్రమలు.. ప్రభుత్వ కార్యాలయాలకు
- సోలార్ ఉన్న గృహాలకు సైతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- పెడన నియోజకవర్గంలో ఇప్పటికి 1,214 స్మార్ట్ మీటర్లు బిగింపు



పెడన పట్టణంలో ఎల్‌టీ-2 కేటగిరిలో స్మార్ట్ మీటరు బిగిస్తున్న సిబ్బంది

పెడన: స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్.. రానున్న కాలంలో సెల్ ఫోన్‌లో ఏ విధంగా అయితే రీఛార్జి చేయించుకుని వాడుకుంటున్నామో భవిష్యత్తులో కూడా అలాగే ముందుగా విద్యుత్‌ను కూడా రీఛార్జి చేసుకునే పరిస్థితి రానున్నది. అందుకు సంబంధించి ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు.

ముందుగా ఇలా..

ముందుగా ఎల్‌టీ– 1 కేటగిరిలో గృహాలకు సంబంధించి సోలార్ ద్వారా విద్యుత్ పొందుతున్న ఇళ్లకు మాత్రమే వారికి ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్‌టీ– 2 కేటగిరిలోని వ్యాపార సముదాయాలకు, ఎల్‌టీ– 3 కేటగిరిలోని పరిశ్రమలకు, ఎల్‌టీ– 4 కేటగిరిలోని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలకు బిగిస్తున్నారు. ముందుగా వీటికి బిగించిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహాలకు బిగించేందుకు సన్నహాలు చేయనున్నారు. ప్రస్తుతం పెడన నియోజకవర్గ వ్యాప్తంగా ఎల్‌టీ– 2 సర్వీసులు 6,123, ఎల్‌టీ– 3 సర్వీసులు 172, ఎల్‌టీ– 4 సర్వీసులు 2,084 ఉన్నాయి.

పాత మీటరు స్థానంలో..



స్మార్ట్ మీటరు

పాత మీటరు స్థానంలో కొత్త మీటరును ఏర్పాటు చేస్తున్నారు. అదేమని అడిగితే విద్యుత్‌శాఖ నుంచి వచ్చామంటున్నారు. స్మార్ట్ మీటరు ఉపయోగాలు, దాని గురించి ఎటువంటి ప్రస్తావన చేయకుండా వాటిని బిగించేసి వెళ్లిపోతున్నారు. గట్టిగా నిలదీసి ప్రశ్నించిన వారికి పూర్తి సమాచారం ఇస్తున్నారు. వాస్తవంగా ఈ స్మార్ట్ మీటరు బిగించే సమయంలో సంబంధిత యజమాని అనుమతి తీసుకోవాలి. వారికి స్మార్ట్ మీటరు గురించి పూర్తి అవగాహన కల్పించి, మీటరు బిగించి వారి నుంచి సంతకం సేకరించాలి. పాత మీటరు స్థానంలో కొత్త మీటరు బిగించి సంబంధిత వ్యక్తుల నుంచి సంతకాలు తీసుకుంటున్నారు.

ప్రస్తుతానికి 1,214 స్మార్ట్ మీటర్లు బిగింపు..

గత పది రోజులు నుంచి పెడన నియోజకవర్గ వ్యాప్తంగా పెడన పట్టణంతో పాటు బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. పెడనలో 322, బంటుమిల్లిలో 379, కృత్తివెన్నులో 213, గూడూరులో 300 స్మార్ట్ మీటర్లను బిగించారు. ఇంకా ఈ పని కొనసాగుతోంది.

పాత మీటరు స్థానంలో కొత్తది అన్నారు..



పాత మీటరు స్థానంలో కొత్త మీటరు బిగిస్తున్నామన్నారు. విద్యుత్‌శాఖాధికారులు మార్పులు ఏమైనా చేశారేమోనని సరే అన్నా. పాత మీటరు తీసుకుపోయి కొత్త మీటరు వేశారు. మీరు వచ్చి అది స్మార్ట్ మీటరు బిగించే వారు కూడా చెప్పలేదు. స్మార్ట్ మీటరు వల్ల ఉపయోగాలు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖపై ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– మాదెం శివసుబ్రమణ్యం, శివ మొబైల్ షాపు, మున్సిపల్ కాంప్లెక్స్, పెడన

పటిష్ట చర్యల కోసమే..



విద్యుత్ వినియోగంపై పటిష్ట చర్యలు చేపట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. ఈ మీటరులో సెల్‌ఫోన్‌లో సిమ్ ఏ విధంగా ఉంటుందో అలాగే ఇందులో కూడా సిమ్ ఉంటుంది. దీని ద్వారా వారు ఎంత విద్యుత్ వినియోగించింది, అదనపు లోడు ఏమైనా వాడుతున్నారా లేదా, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారా అనే విషయాలపై పర్యవేక్షణ ఉంటుంది. పాత మీటర్లు విద్యుత్ వినియోగించుకున్నదానికి బిల్లులు ఎలా చెల్లించారో ఇప్పుడు కూడా అలాగే బిల్లులు చెల్లించాలి. భవిష్యత్తులో ప్రీ పెయిడ్‌లో వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం మాత్రం పోస్టుపెయిడ్ మీటర్లుగానే పరిగణించడం జరుగుతుంది.

– సీహెచ్ ఆర్‌కే మాణిక్యలరావు, ఏడీఈ, పెడన

గురువుల స్థానం ఎంతో ఉన్నతమైనది



షేక్ ఆలీని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

గూడూరు: సమాజంలో గురువుల స్థానం ఎంతో ఉన్నతమైనదని పెడన పురపాలక సంఘ ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్ అన్నారు. గూడూరు ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన షేక్ ఆలీ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కటకం ప్రసాద్ మాట్లాడుతూ తనతోపాటు విద్యాభ్యాసం చేసిన ఆలీ ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దారన్నారు. 43 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గూడూరు సర్పంచి లింగం సులోచనారాణి, ఎంఈఓ– 2 పి.సుబ్రహ్మణ్యం, ఉర్దూ డీఐ ఎండీ.సాదతుల్లా, యూటీఎఫ్ నాయకులు ఎంఎస్‌సీ రాజ్, కె.ఉమామహేశ్వరరావు, ఎల్.వెంకటేశ్వరరావు, మైనార్టీ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి జైగం అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడ్డీకొట్ల తొలగింపు



రేవతి థియేటర్ సెంటర్‌లో బడ్డీ కొట్లను తొలగిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రోడ్డు మార్జిన్‌లలో ఉన్న చిరు వ్యాపారుల బడ్డీ కొట్ల తొలగింపు కార్యక్రమం శనివారం కూడా నిర్వహించారు. గత కొద్ది రోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న బడ్డీల తొలగింపు కొనసాగింపు కొనసాగుతోంది. స్థానిక రేవతి థియేటర్ సెంటర్‌లో ఉన్న బడ్డీ కొట్లను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. పోలీసు పహారా నడుమ క్రేన్‌లు, జేసీబీలతో బడ్డీ కొట్లను తొలగించారు. బడ్డీల తొలగింపుతో తాము ఉపాధి కోల్పోతున్నామని చిరు వ్యాపారులు వాపోతున్నారు. బడ్డీల తొలగింపును మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, టీపీఓ శ్రీహరిప్రసాద్ పర్యవేక్షించారు.

టీడీపీ నేతల మధ్య సీసీ రోడ్డు వివాదం



వాగ్వాదం చేస్తున్న టీడీపీ మాజీ కౌన్సిలర్ సయ్యద్‌ఖాజా

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఫతుల్లాబాద్ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ వ్యవహారం శనివారం ఇరువురు టీడీపీ నాయకుల మధ్య తీవ్ర వివాదానికి దారి తీసింది. ఒకరు 27వ డివిజన్ కార్పొరేటర్ చిత్తజల్లు రాము (రాళ్లకొట్టు రాము) కాగా మరొకరు ఆ డివిజన్ మాజీ కౌన్సిలర్ సయ్యద్‌ఖాజా. ఇరువురు టీడీపీకి చెందిన వారే అయినా రోడ్డు నిర్మాణం చేయాల్సిందేనని ఒకరంటుంటే తర్వాత వేద్దాం.. అంటూ మరొకరు. మంత్రి కొల్లు రవీంద్ర వద్దే తేల్చుకుందాం అంటూ ఒకరినొకరు సవాళ్లకు దిగారు. నేను ఈ డివిజన్ కార్పొరేటర్‌ని అని రాళ్లకొట్టు రాము అనడంతో సయ్యద్‌ఖాజా వ్యంగ్యంగా మాట్లాడాటం గమనార్హం. వీరిద్దరి మధ్య అరుపులు.. కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఈ వివాదం చూస్తున్న వారు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఓ ప్రైవేటు స్థల యజమానికి మేలు చేసేందుకు నీవు రోడ్డు వేస్తావా, దేవుని గుడికి అన్యాయం చేస్తావా అంటూ ఖాజా ..రామును ప్రశ్నించారు. నిర్మాణ పనులను ఆపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్రను అడిగి మరిన్ని నిధులు తెచ్చి ఆంజనేయస్వామి గుడి రోడ్డును పెంచి, డ్రెయిన్లు నిర్మిద్దామని ఖాజా పేర్కొనగా దీనికి రాము విభేదించారు. సిమెంటు రోడ్డు కారణంగా వీరిద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో మహిళలకు గాయాలు

పెడన: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన కొటారి అన్నపూర్ణ (45), బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామానికి చెందిన కేతిరెడ్డి సుజాత (40) ద్విచక్ర వాహనంపై కట్లపల్లి గ్రామంలో ఒక కార్యక్రమానిక హాజరై పెడన వైపుగా వస్తున్నారు. వీరి వెనుకగా వచ్చిన లారీ బలంగా ఢీ కొట్టడంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు హుటాహుటిన మచిలీపట్నం ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించినట్లుగా సమాచారం. అయితే డ్రైవర్ మద్యం మత్తులో లారీ నడిపినట్లుగా తెలుస్తోంది. సదరు విషయమై పోలీసులు పెదవి విప్పకపోవడం, కేసులు ఏమీ లేవని పేర్కొవడం గమనార్హం. ప్రమాదానికి గురైన లారీని మాత్రం స్టేషన్‌కు చేర్చడం కొసమెరుపు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పెడన: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 205 మందికి గాను 199 మంది హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు రామారావు, మున్వర్‌లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు. విజయానంద జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో 135 మందికి 127 మంది హాజరవగా ఎనిమిది మంది అబ్సెంట్ అయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ హిరణ్మయి తెలిపారు. అయితే ఆయా పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయం కంటే ముందుగా చేరుకోవాల్సిన వైద్యశాఖ సిబ్బంది ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మాత్రం 9 గంటలు దాటిన తరువాత చేరుకోవడం విమర్శలకు తావిస్తోంది. అదేమంటే చాలా దూరం నుంచి రావాలని పేర్కొవడం గమనార్హం. పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా విజయ క్రాంతి జూనియర్ కళాశాలో 362 మందికిగాను 354 మంది పరీక్షకు హాజరయ్యారు. 8 మంది గైర్హాజరు అయినట్లు ఆ కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. విజయ జూనియర్ కళాశాలలో 342 మందికిగాను 329 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 13 మంది గైర్హాజరైనట్లు ఆ కాలేజీ చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. మొదటి రోజు పరీక్షకు మండలంలో 21 మంది గైర్హాజరయ్యారు.

21 మంది గైర్హాజరు

చల్లపల్లి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు చల్లపల్లిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెలుగు, సంస్కృతం పరీక్ష నిర్వహించగా సెట్– 2 పేపర్ విడుదల చేశారు. చల్లపల్లిలో రెండు



చల్లపల్లిలో తమకు కేటాయించిన పరీక్ష గదులను చూసుకుంటున్న విద్యార్థులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



హైడ్రో ఫోనిక్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

చల్లపల్లి: సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని శనివారం చల్లపల్లి శ్రీచైతన్య స్కూల్లో హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి చెందిన అంశాలను రూపొందించి విద్యార్థులు ప్రదర్శనలో ఉంచారు. మేక గుండెను తీసుకు వచ్చి కదలికలు ఎలా ఉంటాయో పిల్లలు వివరించారు. తక్కువ స్థలంలో ఎక్కువ పంటను పండించే హైడ్రో ఫోనిక్స్ పద్ధతిని, బ్లూటూత్‌తో నడిచే రోబో వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సైన్స్ ప్రదర్శనను రెండు రోజుల పాటు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డి.సురేష్ తెలిపారు. మొదటి రోజు ప్రైమరీ విద్యార్థులకు, రెండో శనివారం హైస్కూల్ విద్యార్థులకు వేర్వేరుగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నిమ్మగడ్డ(చల్లపల్లి): మండల పరిధిలోని నిమ్మగడ్డ వద్ద కేఈబీ కెనాల్‌పై ఉన్న వంతెన దిగువ భాగంలో గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రజలు తమ పశువులైన గేదెలు, గొర్రెలు, మేకలను మేత మేపుకునేందుకు నిత్యం నిమ్మగడ్డ లంక ప్రాంతాలకు వెళుతూ ఉంటారు. దీంతో అప్పుడప్పుడు ఆ గొయ్యిలో పడిపోయి గాయాలపాలవుతున్నాయి. బయటకు చిన్నగానే కనిపిస్తున్నా.. నాలుగు అడుగుల లోతులో ప్రమాదకరంగా ఉంది. వంతెన దిగువ భాగంలో ఉండటంతో తమ గ్రామానికి ద్విచక్ర వాహనాలపై, కార్లపై కొత్తగా వచ్చేవారు అదుపు తప్పి గోతిలో పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే ఆ గొయ్యి పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

గజ వాహనంపై గ్రామోత్సవం



పెదకళ్లేపల్లిలో గజవాహనంపై ఊరేగుతున్న నాగేశ్వరస్వామివారు


పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్ధ నాగవరప్రసాద్ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిత్యబలిహరణ, రాత్రి 9 గంటలకు గజవాహనంపై శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం పారువేట, భక్తిశ్రద్ధలతో శమీ వృక్షపూజ సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ కార్యక్రమాలు ఘనంగా చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమిషనర్ చొరవతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



పెడన: పట్టణంలో రోడ్డు మధ్యలో డైవడర్ చివరి భాగం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో కమిషనర్ ఎం.గోపాలరావు స్పందించి రక్షణ చర్యలు తీసుకున్నారు. పెడన– గుడివాడ రహదారిలోని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో డివైడర్ చివరి భాగం ఉంది. ఆ డివైడర్ చివరి భాగం రోడ్డు మధ్యలో ఉండటం, హెచ్చరిక బోర్డు లేకపోవడంతో గుడివాడ నుంచి వచ్చే వాహనాలు డివైడర్‌ను ఢీ కొట్టడం, డివైడర్ పైకి ఎక్కడం వంటి సంఘటనలు చాలా చోటు చేసుకుంటున్నాయి. డివైడర్ చివరన హెచ్చరిక బోర్డు పెట్టాలని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కమిషనర్ స్పందించారు. శనివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ పనిని స్వయంగా పర్యవేక్షించారు.

ఆక్రమణలో గంగయ్య చెరువు



బంటుమిల్లి: మండల పరిధిలోని పెద తుమ్మిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గంగయ్య చెరువును స్థలాన్ని ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదంటున్నారు.

విషయం ఇదీ..

పంచాయతీ చెరువు భూమి సుమారు 16 ఎకరాలకు పైగా ఉంటుందని తెలుస్తోంది. గతంలో కైకలూరు నియోజకవర్గ పరిధిలో ఉండగా దాదాపు 35 సంవత్సరాల క్రితం కొంత మంది లబ్ధిదారులకు 3 సెంట్ల చొప్పున పట్టాలు మంజూరు చేశారు. అయితే పట్టాదారులు ఇచ్చినదానికన్నా ఎవరికి తోచిన విధంగా చెరువు కట్టలను ఆక్రమించి భవనాలు నిర్మాణాలు చేశారు.

బోదె కాలువలు పూడిపోవడంతో..

చెరువు కట్టలను రోడ్లుగా అభివృద్ధి చేయడంతో ప్రజావసరాలకు ఉపయోగపడుతున్నది. వర్షాకాలంలో మురుగునీరు బయటకు వెళ్లే బోదెలు ఆక్రమణలో ఉండి పూడి పోవడంతో మురుగునీరుపోయే దారి లేక సమీపంలోని ఇళ్లలోకి చేరుతోంది. గతంలో చెరువు చుట్టూ మంచినీటి ఊట బావులు ఉండేవి. అవి కాలాంతరంలో చెరువులో కలసిపోయాయి. చెరువు భూములు ఆక్రమించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు ఉదాసీనవైఖరి అవలంభిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆక్రమణదారులు భవనాలు నిర్మించి విద్యుత్ సరఫరా తీసుకుని నివాసాలు ఉంటున్నారు. ఇంటి పన్నులు లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వమని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. మరి ఇంటి పన్ను రసీదులు ఎలా ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

నా హయాంలో ఇవ్వలేదు..

గంగయ్య చెరువులో అక్రమ నిర్మాణాలు గతంలో జరిగాయని తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎవరికీ ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఆక్రమణలు జరిగిఉంటే విచారించి తగు చర్యలు తీసుకుంటాం.

–దాసరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి